క్లుప్తంగా

ఉచిత కంటి వైద్యశిబిరం

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణ ప్రభుత్వ ఆస్పత్రిలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించినట్లు ఆప్తాల్మిక్ వైద్యులు హరికిషన్ తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో 51 మందికి కంటి పరీక్షలు చేశారు. వీరిలో 18 మందికి కంటి అద్దాలు అవసరమని గుర్తించగా.. ఆరుగురిని ఆపరేషన్ల నిమిత్తం రిఫర్ చేసినట్లు ఆయన తెలిపారు.

మల్లారెడ్డి నారాయణ ఆస్పత్రి ఆధ్వర్యంలో..



బీబీపేట: మండల కేంద్రంలోని మల్లారెడ్డి నారాయణ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పలు రకాల పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సుమారు 220 మందికి పరీక్షలు నిర్వహించారు. ఆపరేషన్లు అవసరం ఉన్నవారికి సైతం ఉచితంగానే ఆపరేషన్లు చేస్తామని వైద్యులు తెలిపారు. నేతలు సుతారి రమేష్, భూమాగౌడ్, మహేష్, భాస్కర్, డాక్టర్లు జరీనా, వైద్య బృందం సునీత, స్నేహిత, దేవదాసు, ఓబుల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ మాత్రలు ప్రతి ఒక్కరికి అందించాలి



ఎల్లారెడ్డిరూరల్: నులి పురుగుల నివారణకు అల్బెండజోల్ మాత్రలను ప్రతి ఒక్కరికి అందించాలని మత్తమాల పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ శరత్ అన్నారు. గురువారం ఏఎన్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. మండలంలోని 1 నుంచి 19 ఏళ్ల లోపు వారందరికి ఈ నెల 10న అల్బెండజోల్ మాత్రలు అందించి వారు వాటిని చప్పరించి మింగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

45వ సారి రక్తదానం

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని ధర్మారావ్‌పేట్‌కు చెందిన సంతోష్‌రెడ్డి 45వ సారి రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు. జిల్లా కేంద్రానికి శాంత నిమ్స్ ఆస్పత్రిలో ఒకరికి బ్రెయిన్ సర్జరీ జరిగింది. ఒ–పాజిటివ్ రక్తం అవసరం కాగా మానవతా దృక్పథంతో సంతోష్‌రెడ్డి స్పందించి రక్తదానం చేసి ప్రాణదాతగా నిలిచినట్లు ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్, రెడ్‌క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రక్తదానం చేయడానికి యువత ముందుకు రావాలని పేర్కొన్నారు. రక్తదానం చేయాలనుకున్న దాతలు ఈ సెల్‌నంబర్ 9492874006ను సంప్రదించాలన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు అర్హులను గుర్తించాలి



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని 41 గ్రామ పంచాయితీల పరిధిలోని గ్రామాల్లో అర్హులైన లబ్ధిదారులను మాత్రమే ఇందిరమ్మ ఇళ్లకు ఎంపిక చేయాలని ఎంపీడీవో నరేశ్ సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యదర్శుల సమావేశంలో మాట్లాడారు. 2014కి ముందు గృహాలు పొందిన వారు అనర్హులన్నారు. గతంలో తీసుకున్న వారికి తిరిగి మళ్లీ ఇందిరమ్మ గృహాలకు ఎంపిక చేస్తే కార్యదర్శులదే బాధ్యత అన్నారు. గ్రామాల్లో నివాస యోగ్యం కాని వారిని మాత్రమే గుర్తించాలని స్పష్టం చేశారు. ఎంపీవో మలహరి, కార్యదర్శులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని ఎల్లారెడ్డికి వెళ్లే రహదారి ప్రక్కన మురికి కాల్వలు శుభ్రం చేస్తున్న పనులను ఎంపీవో మలహరి గురువారం పరిశీలించారు. అలాగే తాగునీటి పైపులైను లీకేజీలను పూడ్చివేయించారు. నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. కార్యదర్శి శ్రవణ్ కుమార్, బట్టు సాయిలు, సిబ్బంది ఉన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి



పెద్దకొడప్‌గల్(జుక్కల్): ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో లక్ష్మీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో పంచాయతీ సిబ్బందితో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి మురికి కాలువలను శుభ్రం చేయించారు. పలు సూచనలు చేశారు. కార్యదర్శి శ్రీను గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

శిథిల భవనాలు.. గుప్పెట్లో ప్రాణాలు

- విద్యార్థులకు పొంచి ఉన్న ప్రమాదం
- పలు పాఠశాలల్లో శిథిల భవనాలను తొలగించని అధికారులు

బాన్సువాడ రూరల్ : మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో భవనాలు శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా మారాయి. నూతన భవన సముదాయాలను నిర్మించడంతో ప్రస్తుతం పాత వాటిలో విద్యాభ్యాసం కొనసాగడం లేదు. అయినా ఇంటర్వెల్, ఆటల సమయంలో విద్యార్థులు వాటి కిందికు, లోపలికి వెళ్లి ఆడుకుంటున్నారు. శిథిలావస్థలో ఉన్న ఆ భవనాలు కూలితే విద్యార్థుల ప్రాణాలకు ప్రమాదం పొంచి ఉంది. నూతన భవనాలను నిర్మించగానే పాతవాటిని నేలమట్టం చేసి విద్యార్థులు ఆడుకోవడానికి వీలుగా చదును చేయాల్సి ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రధానోపాధ్యాయులు తమ వద్ద ఎలాంటి నిధులు లేవని చేతులెత్తేస్తుండగా, స్థానిక సర్పంచ్‌లు సైతం నిస్సహాయత వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని బుడిమి, కొత్తాబాది, బోర్లంక్యాంపు, తాడ్కోల్, మొగులాన్‌పల్లి, తిర్మలాపూర్, కోనాపూర్, దేశాయిపేట్ ఇలా ప్రతి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల్లో శిథిల భవనాలు దర్శనమిస్తున్నాయి. శిథిల భవనాలు పాములు, తేళ్లు, ఇతర విష కీటకాలకు నిలయంగా మారుతున్నాయి. పైకప్పు పెచ్చులూడి, పిచ్చిగడ్డితో దర్శనమిస్తున్నాయి. సుమారు 30–40 ఏళ్ల క్రితం నిర్మించిన పాతభవనాలు ఎప్పుడైనా కూలిపోయే ప్రమాదం ఉంది. వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలకు మరింత ప్రమాదకరంగా మారాయి. వర్షం పడినపుడు డాబాలపై నీరు నిల్వ ఉంటుండంతో డెంగీ దోమలు పెరిగి విద్యార్థులను కుట్టే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి శిథిల భవనాలను తొలగించాలని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఇరుకుగా ప్రాంగణాలు.. క్రీడలకు దూరం

విద్యార్థులకు తరగతి గదిలో నాలుగు గోడల మధ్య విద్యాబోధన ఎంత ముఖ్యమో వారికి ఆటలు కూడా అంతే ముఖ్యం. క్రీడాపోటీల్లో పాల్గొనడం వల్ల వారి శారీరకంగా దృఢంగా ఉండటంతోపాటు మానసిక వికాసం పొందే అవకాశం ఉంటుంది. పాఠశాల ప్రాంగణాల్లో కొత్త భవనాలు నిర్మించడంతో విద్యార్థులకు క్రీడాప్రాంగణం చిన్నబోయింది. పాత భవనాలను తొలగించినట్లయితే మైదానం పెరిగి విద్యార్థులు చక్కగా ఆడుకునే అవకాశం కల్గుతుంది. అధికారులు, ప్రజా ప్రతినిధులు ఇప్పటికైనా ఆ దిశగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



శిథిలావస్థలో బుడిమి పాఠశాల పాత భవనం

తొలగిస్తే సౌకర్యవంతంగా ఉంటుంది



శిథిలావస్థకు చేరిన భవనాలను తొలగిస్తే విద్యార్థులకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుంది. అయితే అక్కడున్న ప్రధానోపాధ్యాయులు కొత్త భవనాలు మంజూరైనపుడు కాంట్రాక్టర్‌ను ఒప్పించి పాత భవనాలను తొలగించుకుంటే సమస్య రాదు. లేదంటే ఎస్‌ఎంసీ సమావేశమై తీర్మానం చేసి శిథిల భవనం తొలగించగా వచ్చే పాత ఇనుము, కిటికీలు, కట్టెలు విక్రయించి ఖర్చుకు సరిపెడితే ఇబ్బంది ఉండదు.

– నాగేశ్వరరావు, ఎంఈవో, బాన్సువాడ



కొత్తాబాదిలో నిరుపయోగంగా పాఠశాల పాత భవనం



తిర్మలాపూర్‌లో..

సీఎం చిత్రపటాలకు పాలాభిషేకం



జిల్లా కేంద్రంలో రేవంత్ రెడ్డి, షబ్బీర్ అలీ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నేతలు



బిచ్కుందలో పాలాభిషేకం చేస్తున్న నాయకులు

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ముందు గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీల చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం బీసీ కుల గణన, ఎస్సీ వర్గీకరణపై తీసుకున్న నిర్ణయాన్ని దేశ మొత్తం స్వాగతిస్తుందని అన్నారు. పదేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేయలేనిది ఏడాదిలోనే కాంగ్రెస్ ప్రభుత్వం చేసి మాట నిలబెట్టుకుందన్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు పండ్ల రాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోనె శ్రీనివాస్, ఓబీసీ సెల్ అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గుడుగుల శ్రీనివాస్, ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడు సందీప్, తదితరులున్నారు.

బిచ్కుంద(జుక్కల్): ఎస్సీ వర్గీకరణకు మంత్రి వర్గం ఆమోదం తెలపడంతో కాంగ్రెస్, మాదిగ నేతలు గురువారం బిచ్కుందలో అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు దర్పల్ గంగాధర్ మాట్లాడారు. దళిత మాదిగ నాయకులు తుకారాం, రమేష్, చందు, పుల్కల్ సొసైటీ చైర్మన్ భీం పటేల్, కాంగ్రెస్ నాయకులు దడ్గి నాగ్‌నాథ్, ఖలీల్, రాజు పటేల్ పాల్గొన్నారు.

జల్సా కార్యక్రమ పోస్టర్ల ఆవిష్కరణ



బిచ్కుంద(జుక్కల్) : మండల కేంద్రంలోని ఆబెదీన్ మజీద్‌లో ఈ నెల 20న రాత్రి 7 గంటలకు నిర్వహించనున్న జల్సా కార్యక్రమ పోస్టర్లను గురువారం మౌల్వీలు, గ్రామ పెద్దలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మౌలానా రిజ్వాన్ ఖాస్మీ మాట్లాడుతూ.. మార్చి నెల ప్రారంభంలో పవిత్ర రంజాన్ మాసం ప్రారంభం అవుతుందని, దీనికి సంబంధించిన జల్సా ఈ నెల 20న బిచ్కుంద ఆబెదీన్ మజీద్‌లో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన వక్తలు మౌలానా అర్షద్ అలీ ఖాస్మీ, మౌలానా వాజిదొద్దిన్ ఖాస్మీ ఇతర ముఖ్యులు పాల్గొంటున్నారని తెలిపారు. నేతలు హాఫీజ్ మహ్మద్ గౌస్, మౌలానా రహీం పాల్గొన్నారు.

ప్రజా సంఘాల మహా ధర్నాను విజయవంతం చేయాలి



కామారెడ్డి టౌన్: కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈ నెల 10న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద చేపట్టబోయే మహాధర్నాను విజయవంతం చేయాలని ప్రజా సంఘాల జిల్లా కన్వీనర్ కందూరి చంద్రశేఖర్ కోరారు. గురువారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని కార్మికులు, రైతులు, తదితరులు ఈ మహాధర్నాకు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. నేతలు మోతీరాం నాయక్, కొత్త నర్సింలు, రాజనర్సు, ముదాం అరుణ్, మాజీ కౌన్సిలర్ రేణుక తదితరులున్నారు.

తాగునీటి ఎద్దడి నివారణ చర్యలు చేపట్టాలి



జప్తిజాన్కంపల్లిలో పైపులైన్ లీకేజీని పరిశీలిస్తున్న అధికారులు



సబ్దల్‌పూర్‌లో ట్యాంకును పరిశీలిస్తున్న ఎంపీవో

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): రానున్న వేసవిలో గ్రామాల్లో ఎక్కడా కూడ తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలని నాగిరెడ్డిపేట ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజ్‌కుమార్ సూచించారు. స్పెషల్‌డ్రైవ్‌లో భాగంగా జప్తిజాన్కంపల్లి, మెల్లకుంటతాండను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో గల మంచినీటి ట్యాంకులు, పైపులైన్ లీకేజీలను ఆయన పరిశీలించారు. కార్యదర్శులు శంకర్, పవిత్ర ఉన్నారు.

ఎల్లారెడ్డిరూరల్: తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని ఎంపీవో ప్రకాష్ అన్నారు. గురువారం సబ్దల్‌పూర్‌లో నీటి ట్యాంకును పరిశీలించారు. నీటి ఎద్దడి ఏర్పడితే తీసుకోవాల్సిన ప్రత్యామ్నాయ చర్యల గురించి వివరించారు. మిషన్ భగీరథ ఏఈ వినోద్, తదితరులున్నారు.

ప్రభుత్వ ఆస్పతిలో ప్రసవాలను ప్రోత్సహించాలి



సదాశివనగర్(ఎల్లారెడ్డి): ప్రభుత్వ ఆస్పత్రిలోనే ప్రసవాలు జరిగేలా చూడాలని పీహెచ్‌సీ వైద్యాధికారిణి ఆస్మా అప్షిన్ అన్నారు. గురువారం మండల కేంద్రంతో పాటు కుప్రియాల్, కల్వరాల్, భూంపల్లి, ధర్మారావ్‌పేట్ గ్రామాల్లో అమ్మ ఒడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె గర్భిణులు, బాలింతలకు పలు సూచనలు చేశారు. డెలివరీకి ముందు, డెలివరీ తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. సీహెచ్‌వో నాగరాజు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

చదువుకునే పిల్లలను పనికి పంపడం నేరం



అవగాహన కల్పిస్తున్న అయ్యాల సంతోష్

బాన్సువాడ రూరల్: చదువుకునే పిల్లలను పనులకు పంపడం చట్టరీత్యా నేరమని, పనిలో పెట్టుకున్న వారిపై కేసుల తప్పవని సోమేశ్వర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు అయ్యాల సంతోష్ అన్నారు. గురువారం ఆయన పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు. డ్రాప్ అవుట్ విద్యార్థులను తిరిగి పాఠశాలకు పంపాలని కోరారు. అలాగే పాఠశాలకు వచ్చే విద్యార్థులు ఇంటి వద్ద హోం వర్క్ చేసుకునేలా పర్యవేక్షించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. ఉపాధ్యాయులు ఉమేరుద్దీన్ ఉన్నారు.

సంక్షిప్తం

మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్‌కు సన్మానం



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని సరస్వతీ విద్యామందిర్ హైస్కూల్ నూతన భవన నిర్మాణానికి సహకరించినందుకు మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఇందుప్రియను గురువారం సన్మానించారు. శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. స్కూల్ యాజమాన్యం కమిటీ అధ్యక్షుడు శ్యాంసుందర్, సంచాలన సమితి అధ్యక్షుడు బోద్దు శంకర్, తదితరులున్నారు.

ఘనంగా మైసమ్మ పండుగ

సదాశివనగర్(ఎల్లారెడ్డి): అడ్లూర్ ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీ మైసమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కార్మికులకు భోజనం ఏర్పాటు చేశారు. వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రావు, డిస్టిలరీ డీజీఎం సుబ్బారావు, పీవో వెంకటేశ్వర్ రావు, ఫైనాన్స్ మేనేజర్ మాలకొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

పంటల వివరాలు నమోదు



బీబీపేట: జనగామలో గురువారం పంటల వివరాలు నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఏఈవో రాజేశ్ వ్యవసాయ పొలాల వద్దకు వెళ్లి పంటలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. తెగుళ్లపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రస్తుతం వరిలో సోకుతున్న మొగి పురుగు పట్ల రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని, వరి పొలాన్ని ఆరబెడుతూ నీళ్ల పెట్టాలని రైతులకు తెలిపారు. వాతావరణంలో మార్పుల వల్లే వరి పంటలకు రోగం సోకుతుందని తెలిపారు.

రాజంపేట పీహెచ్‌సీలో అమ్మ ఒడి

రాజంపేట: స్థానిక పీహెచ్‌సీలో గురువారం అమ్మ ఒడి కార్యక్రమాన్ని నిర్వహించినట్లు మెడికల్ ఆఫీసర్ విజయలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశామన్నారు. గర్భిణులు ప్రతి నెలా క్రమం తప్పకుండా వైద్యులను సంప్రదించి మందులు వాడాలని సూచించారు. డాక్టర్ సంగీత, సూపర్వైజర్ మంజూర్, గంగామణి పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

పెద్దకొడప్‌గల్(జుక్కల్): విఠల్‌వాడి తండాలో గురువారం సీసీ రోడ్డు నిర్మాణ పనులను కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు జాగూర్ సింగ్ మాట్లాడుతూ.. రూ.5 లక్షల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో ఈ సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించినట్లు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు శంకర్ పటేల్, రాథోడ్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్‌పై అవగాహన



సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి రోహిత్ కుమార్

పిట్లం(జుక్కల్): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సామాజిక ఆరోగ్య కేంద్రం క్షేత్రస్థాయి సిబ్బందికి అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆస్పత్రి వైద్యాధికారి రోహిత్ కుమార్ మాట్లాడుతూ.. జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమం ఈనెల 10న ప్రారంభించనున్నామన్నారు. అల్బెండజోల్ మాత్ర 2 సంవత్సరం పిల్లలకు సగం, రెండు నుంచి మూడు సంవత్సరాల పిల్లలకు ఒక మాత్ర, 3 నుంచి 19 సంవత్సరాల పిల్లలకు ఒక మాత్ర మధ్యాహ్నము అన్నం తిన్న తర్వాత వేయాలన్నారు. ఈ మాత్రల వల్ల కడుపులో నులి పురుగులు చనిపోతాయన్నారు. అనంతరం అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ ద్వారా పెద్దల్లో వచ్చే క్షయ వ్యాధి నివారణపై వైద్య సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. హెల్త్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ భూమయ్య, పబ్లిక్ హెల్త్ నర్స్ అన్వరీ బేగం, సూపర్‌వైజర్స్ యశోద శాంతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షహనాజ్ బేగం, హెల్త్ అసిస్టెంట్స్ విజయ్ కుమార్, శ్యామ్ రావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో చేరితే ఉజ్వల భవిష్యత్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

బాన్సువాడ: విద్యార్థులు ప్రభుత్వ కళాశాలలో చదివితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వ కళాశాలలో చదివితే కలిగే ప్రయోజనాల గురించి అవగాహన కల్పించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదవిన పూర్వ విద్యార్థులు ఎంబీబీఎస్, టీటీసీ స్టేట్ ర్యాంకులు సాధించారని తెలిపారు. అధ్యాపకులు యాదాగౌడ్, జలీల్, రుక్మిణీ, ఇక్బాల్, మహేష్, అభిలాష్, దయానంద్, మక్బూల్ తదితరులున్నారు.

బకాయి వేతనాలు చెల్లించాలి



ఆస్పత్రి ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు

బాన్సువాడ : ఆస్పత్రిలో పని చేస్తున్న కార్మికులకు నాలుగు నెలల బకాయి పడ్డ వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ గురువారం ఆస్పత్రి ఎదుట కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు దుబాస్ రాములు మాట్లాడుతూ.. బకాయి వేతనాలను చెల్లించే వరకు ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. వేతనాలు ప్రతి నెలా 5లోగా చెల్లించాలని కోరారు. కార్మికులు రేణుక, సురేఖ, కమర్, జైల్‌సింగ్, సంగీత, గంగారం, సుశీల, తదితరులు ఉన్నారు.

శ్రీశైలానికి శివదీక్ష స్వాముల పాదయాత్ర



బాన్సువాడ : శ్రీశైలం పుణ్యక్షేత్రానికి శివమాలధారణ స్వాములు పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. మహాశివరాత్రి పురస్కరించుకుని 41 రోజుల పాటు శివ దీక్ష చేసినటువంటి స్వాములు గురువారం బాన్సువాడ శివాలయంలో ఇరుముడి కట్టుకుని పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. ప్రతి రోజూ 30 కిలోమీటర్ల చొప్పున 400 కిలోమీటర్ల దూరంలో ఉన్న శ్రీశైలం ఆలయానికి మహాశివరాత్రి రోజున చేరుకుంటారు. ఓం నామస్మరణతో ప్రతి రోజూ పాదయాత్ర కొనసాగుతుంది.

శాంతి భద్రతల పరిరక్షణకు తోడ్పాటు



కెమెరాలను ప్రారంభిస్తున్న ఎస్సై ఆంజనేయులు, దాత జ్ఞానప్రకాశ్‌రెడ్డి

భిక్కనూరు: శాంతి భద్రతల పరిరక్షణకు సీసీ కెమెరాలు ఎంతగానో తోడ్పాటును అందిస్తాయని భిక్కనూరు ఎస్సై ఆంజనేయులు అన్నారు. మండల కేంద్రంలోని పాత దళితవాడలో కౌసల్యాదేవి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పెద్దబచ్చగారి జ్ఞానప్రకాశ్‌రెడ్డి రూ.60 వేలు వెచ్చించి ఏర్పాటు చేయించిన సీసీ కెమెరాలను ఎస్సై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీసీ కెమెరాల ఏర్పాటుకు జ్ఞానప్రకాశ్‌రెడ్డి పూర్తి సహకారం అందించడం అభినందనీయమన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల అసాంఘికశక్తుల అలజడి తగ్గిపోతుందన్నారు. కాలనీవాసులు.. ఎస్సై ఆంజనేయులు, కెమెరాల దాత జ్ఞానప్రకాశ్‌రెడ్డిలను శాలువాలతో సత్కరించారు. అంబేడ్కర్ సంఘం నేతలు డప్పు రవి, కర్రోళ్ల రాజు, తాటికొండ బాబు, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి మహాలింగేశ్వర ఆలయ ప్రతిష్ఠాపన ఉత్సవాలు

కామారెడ్డి అర్బన్: దేవునిపల్లి విద్యుత్, గాయత్రీనగర్ సరిహద్దులోని మంగళగౌరీ సమేత మరకత మహాలింగేశ్వర దేవాలయం ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఈ నెల 8, 9, 10వ తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు నంగునూరి కిరణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి గోపు వెంకటేష్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. దేవదేవతా మూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపన తొగుట పీఠాధిపతి మాధవనంద సరస్వతి స్వామి నిర్వహిస్తారన్నారు. ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలుంటాయని, ప్రతిరోజు మధ్యాహ్నం అన్నప్రసాదం, సాయంత్రం ప్రముఖ కళాకారులతో సంగీత విభావరి, నాట్య ప్రదర్శనలు, భజనలు, ప్రవచనాలుంటాయని పేర్కొన్నారు.

ఆధ్యాత్మికం..

ఘనంగా కన్యకాపరమేశ్వరి ఉత్సవాలు



బీబీపేట: మండల కేంద్రంలోని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కన్యకాపరమేశ్వరి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. గురువారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతే కాకుండా శ్రీ కృష్ణానంద స్వామి వారితో భగవద్గీతపై ప్రబోధించారు.

కార్యవర్గం ఎన్నిక..

మీ–సేవ, జిరాక్స్ సెంటర్ నిర్వాహకుల యూనియన్



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల మీ–సేవ, జిరాక్స్, ఆన్‌లైన్ సెంటర్ల నిర్వాహకుల యూనియన్‌ను గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కుచన్‌పల్లి సత్యనారాయణ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్, కోశాధికారిగా శ్రీరామ్, కార్యవర్గ సభ్యులు, సలహాదారులుగా నరేష్, వాజీద్, సుబ్బు, ప్రవీన్, గౌతం, ప్రసాద్, గురుప్రసాద్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూనియన్ తీసుకున్న నిర్ణయాలకు అందరూ కట్టుబడి ఉండాలని వారు తీర్మానం చేశారు.